## జ్యోతి-భాగ్యలక్ష్మి లాటరీ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# జీవితపోరాటం

మూసివున్న కను రెప్పలు.

నరాలులేచి కనుపాపలుకదిలి, మెల్లిగా కళ్ళు తెరుచుకుంటున్నాయి

గాలికి తలుపు తెరుచుకుంటున్న దృశ్యం.

గడపదాటేసి దూసుకు వస్తున్న వెల్తురు.

శుభ్రమైన కన్ను. మధ్యలో నల్లని గుడ్డు. కనుగుడ్డు గోళం లాగా అయ్యి తనచుట్టు తాను తిరుగుతోంది. గోళం నిండా సముద్రం. ఖండాలు. ఖండాలు కత్తిరించినట్టు దేశాలు దేశాల్ని ముక్కలు కోసినట్లు రాష్ట్రాలు. గోళం తిరుగుతోంది సముద్రపు అలలు.... వృక్షాలు, జంతువులు, పొలాలు, ఊళ్ళూ, అనాగరికులు, ఎడారులు, నగరాలు, నాగరికులు, గుట్టలు, లోయలు....

సముద్రపు అలలు....గోళం మెల్లగా తిరుగుతోంది.

ఐరోపా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా ఆసియా దక్షిణంలో పూర్తి చివరికొనన భారతదేశము.

వ్యవసాయ దేశంలాగా ఆకుపచ్చ రంగులో భారతదేశం ఆకుపచ్చ రంగు మారి నల్లని చుక్కలు కనిపిస్తున్నాయి. చుక్కలు మెల్లిగా కదులుతున్నాయి. నల్లని చుక్కలు మనుషుల తలలవుతున్నాయి. ముఖాలు కనిపిస్తున్నాయి. బరువుల్తో, బాధ్యతల్తో క్రుంగి కృశిస్తున్న మనుషులు. కోట్లకు కోట్లే. గజిబిజిగా సందులేకుండా... ....పీక్కుపోయిన ముఖం, కింద చిన్న మెడ, బొమికలు తేలిన రొమ్ము, భుజాలు. అతుక్కుపోయిన డొక్క. చింకి పంచె కట్టెపుల్లలా కాళ్ళూ, కాళ్ళకు బలమైన ఇనుప గొలుసులు. వెనక్కి లాగి చేతులకు వేసిన బేడీలు. భారద్దేశపటం మీద హింసించబడుతూ వున్నట్టు సామాన్యుడు అతికించినట్టున్నాడు. అతని చుట్టూ చూసి

## దేవరాజు మహారాజు



నంత దూరం అతనిలాంటి వాళ్ళే-ఇనుప గొలుసుల్తో కట్టివేయబడ్డ మనుషులు!!

o o o o

చేతిమీద ఏదో వస్తువు పడింది. ఆ వస్తువేదో ఆలోచనలమీద పడ్డట్టయ్యింది. మగతలోంచి లేచి చూసుకున్నాడు గ్లోబ్ లాగా గుండ్రని బంతి. భూమి లాగా గుండ్రని బంతి.

"నాన్నా నా బాల్...."

యాదవరెడ్డి తల తిప్పి చూసాడు. రోహిణ్ కనిపించాడు బంతికోసం వాడు మంచంచుట్టూ తిరుగుతున్నాడు

"ఇదిగో- దూరంపోయి ఆడుక్కో."

బంతిచేతిలోకొచ్చిన మరక్షణమే రోహిణ్ ఎగురుతూ ఆ గదిలోనే మరో మూలకు పరిగెత్తాడు. వాడి చిన్న చేతుల నిండా గుండ్రని బంతి బంతి చుట్టూ నిలువు గీతలు. ఎర్రవి నీలంవి నల్లవి... బంతి. భూమి బంతి.

కేవలం తలనొప్పే కాదు. వళ్ళంతా నొప్పిగా వుంది. విధి నిర్వహణలో గత రెండ్రోజులుగా సరిగా నిద్రలేదు అలసట తీరలేదు. కళ్ళను కుట్టేసే ప్రయత్నం చేస్తోంది నిద్ర. గదంతా వేడిగా వుంది. కిటికీలోంచి దురాక్రమణ చేసిన ఎండ గదంతానిండింది. బయటట్రాఫిక్ చప్పుడు కొద్దిగా వినిపిస్తోంది. గ లోకి కిటికీకి అవతలి వైపు బండివాని గొంతు వినిపిస్తోంది. మంచి పోతున్న ఉల్లి గడ్డలూ, ఇతర కూరగాయలూ అమ్ముతున్నట్లుంది.

"చిన్నదూ అమ్మేదిరా?"

"ఊఁ-"


"అమ్మ!- అమ్మెటు పోయిందిరా?"

"ఊఁ- ఇగో-అమ్మ... అమ్మనా?.... అమ్మా... ఇంగ అన్నయ్య బజారుకు పోయ్యె డ్రి-" అతి:ష్టగా చెప్పి అని తానందాన్ని పొందాడు రోహిణ్.

కిరోసిన్ క్యూలు, చక్కెర క్యూలు కళ్ళముందు కదిలాయి తనో సగటు మనిషి రేషన్‌కోసం పరిగెత్తే ఉద్యోగం ....ఏదో జ్ఞాపకాని కొచ్చింది షాకొట్టిన వాడిలా లేచాడు. టైం చూసుకున్నాడు-మూడయ్యింది హడావుడిగా తయారయ్యాడు. అప్పటికే పదిహేను నిముషాలు గడిచాయి. సుమారు గంటలోగా పత్రికాఫీసులో వుండాలి.

"ఒరేయ్ తలుపేసుకో"- రోహిణ్ పరిగెత్తుకొచ్చాడు. కాని ఒంటరిగా వుండలేనని కాబోలు కళ్ళనిండా భయం నింపుకున్నాడు "భయపడకు అమ్మొస్తుందొచ్చు ..రాత్రి కొచ్చేప్పుడు చాక్లెట్లు తెస్తానేం ఏడవకూ-'' ఓదార్పు మాటల్ని వెనక కాస్తున్నా పుటే అడుగులు ముందుకు పడుతున్నాయి. ఆయింటి ముందు సందు చిన్న రోడ్డున కలిసింది. చిన్నరోడ్డు సాగిసాగి మెయిన్ రోడ్డులో కలిసింది. బస్సుకనిపిస్తే పరిగెత్తి అందుకున్నాడు మెల్లగా కదిలోంది బస్సు. మూడు బస్సుల్లో ఎక్కాల్సినవాడు ఒక్క బస్సులో కూరుకుపోయారు. ఐదు నిముషాలకో బస్సు ఏర్పాటయినట్టు పత్రికలో రాసింది తనే.

ఒకప్పటి యాదవరెడ్డి, కేవలం యాదవ్‌గా మారిన ఇప్పటి యాదవరెడ్డి బస్సుకు వ్రేలాడుతున్నాడు బతుకు వేలాడుతున్నట్టు! బస్సు నుండి రాలితే బ్రతుకునుండి రాలిపడ్డట్టే అనుకున్నాడు. రెండు మూడు నిముషాలు పెనుగులాడి




అతికష్టంమీద బస్సులోకి చేరగలిగాడు. పైనవుండే ఐరన్‌రాడ్‌ను పట్టుకొని కిటికీ లోంచి బయిటకు చూసాడు. కిటికీలోంచి వచ్చే చల్లగాలి హాయిగా వుంది. కిటికీ పక్కనే కూచున్నతనికి బోడిగుండు వుంది. నల్లగా బక్కగా పిల్లిగడ్డంతో అనాగరికంగా వున్నాడు. జనుముతో తయారైన మామూలుమఫ్లర్ మెడచుట్టూ చుట్టుకున్నాడు. కిటికీఅద్దం దించే ప్రయత్నం చేస్తున్నాడు బస్సు కదులోంది. బస్సులోని కిటికీ, కిటికీలో దృశ్యాలు కదులుతున్నాయి. రోడ్డు పక్కనే దుకాణాలు, హోటలు, చెత్తకుండీ, వనమహోత్సవం నాడు చెట్లు నాటినారనడానికి గుర్తుగా వున్న ఇనుప జాలీలు, సినిమా హాలును కప్పేసిన బట్టలేని హీరోయిన్ బొమ్మ, ఉచ్చలతో నానిన పిట్టగోడ, మిరపకాయ బజ్జీల బండి, వెలగనక్కాయల బండి, రోడ్డునిండా ఒకరివెంట ఒకరు పడే ఆడవాళ్ళు, మగాళ్ళు, అరటిపళ్ళబండి, సింగోడాబండి టాక్సీ సైకిల్ దుకాణం, మటన్ షాపు, ఫర్నీచర్ దుకాణం, పెట్రోలు బంకు. పెట్రోలుకోసం అల్లరిచేస్తున్నవాహనాలు, ఎండలో శిలా విగ్రహాల్లా వాటి తాలూకు మనుషులు. అక్కడక్కడ సెక్సీక్వీన్స్‌లా వివిధ భంగిమల్లో వైన్‌షాపులు. వినయం ఒలికిస్తున్న బ్యాంకు.

కిటికీ దించే ప్రయత్నం విఫలమైంది. బోడిగుండతను యాదవ్‌ని తట్టిఅన్నాడు. "గీ అయినా ఉత్తాయించు సార్! గాలి గుసాయించి సతాయిస్తాంది" యాదవ్‌కు అర్థంకాలేదు. అయోమయంగా చూసాడు. అతను మళ్ళీ అదే వాక్యం అన్నాడు. విన్నవాళ్ళు కొందరు తమలోతాము నవ్వుకున్నారు. ఆ భాష గురించి - అప్పటికి అర్థమైంది. అద్దం కిందికి దించమంటున్నాడని. అద్దం కిందికి దించాడు. అతను కృతజ్ఞతా పూర్వకంగానవ్వాడు. నవ్వులో దగ్గుతెర. మఫ్లర్ నోటికడ్డంగా పెట్టుకున్నాడు.


పోస్టాఫీసు దగ్గర ఆగింది సిటీబస్సు

స్విచ్ ఆఫ్‌చేస్తున్నట్లు గాలి ఆగి ఉక్క(పోత). కండక్టర్ టికెట్లకోసం తల్లడిల్లి పోతున్నాడు అసలు నిలబడడమే కష్టంగా వుంది. తనో ఇద్దరిమీద నిలుచున్నట్టూ, తనమీదో నలుగురు నిలుచున్నట్టూవుంది. "టాంక్‌బండ్ - ఒకటి" - అన్నాడు యాదవ్ అతనిచెయ్యి కండక్టర్ను చేరుకునేలా లేదు. మధ్యలో మరో పదిమంది వున్నారు. మధ్యలో నిలబడిన అతని ద్వారా టికెట్ కార్యక్రమం విజయవంతమైంది. హమ్మయ్య అనుకున్నాడు. బస్సులో అంత కిక్కిరిసిన జనంమధ్య-చచ్చిపోతున్నట్టుగా వుంది. ఒకరి కాళ్ళు ఒకరు తొక్కుతూవుంటే-బురద తొక్కు-తున్నట్టుగా వుంది. ఒకరి వీపు ఒకరు చూసుకుంటూ, ఒకరి చెమట ఒకరు ఆనందిస్తూ ఒకరిజేబులొకరు కత్తిరిస్తూ ఒకరి వెనుక ఒకరు గోతులు తవ్వుకుంటూ ఒకర్నొకరు పొడుచుకుంటూ.. ఛ-ఛ, సమాజంలో బ్రతుకులాగే వుంది బస్సు ప్రయాణం. చూపు కిటికీ లోంచి బయటకు పొడిగిస్తే - చెత్తకుండీవద్ద కుక్కలు గుడ్డపేలికకోసం కొట్లాడుకుంటున్నాయి ...అధికారంకోసం తన్నుకునే క్షుద్ర రాజకీయ వేత్తలు స్ఫురించారు.

"ఏంసార్ అట్లనవ్వుతారు? ఈవార్త చదివిన్రా ఏంది?" - అన్నాడు ముందు సీట్లో కూర్చుని పేపరు చదువుకొంటున్న వ్యక్తి. అతను అనే వరకూ యాదవ్‌కి తెలియదు తను నవ్వుతున్నసంగతి తెల్ల లాల్చీలో అతను శుభ్రంగా ఉన్నాడు.

"లేదులేదు-ఏదో జ్ఞాపక మొచ్చింది"

'అట్నా-గీపేపరు చదివిన్రేమో నను కున్న. ఇగోదు ఆఫీసులు రాత్రి పూట పెట్టి దినమంత మూసేస్తరట దినమంత కుటుంబసభ్యులతో గడపడానికి షాపింగ్ చేసోకడానికి వీలు గల్పిస్తున్నరట-'' పెద్దగా బస్సులో ఎవరినీ పట్టించుకోకుండా నవ్వుతున్నాడు. యాదవ్ కూడా అసహ్యంగా పెదాలమీద నవ్వు కక్కు-కున్నాడు. చరిత్రలో తుగ్లక్ పారం జ్ఞాపకం చేసుకున్నాడు. అతను చదువుతున్న పేపర్లో బస్సు కాలుతున్న ఫోటో వుంది. దానికి కొంచెం పైన "సైన్యం తిరుగుబాటు-" "డి. ఎ. కొరకు ఉద్యోగుల సమ్మె"- పెద్ద అక్షరాలతో శీర్షికలు కనిపించాయి. పేపరు చదువుతున్నతను పేజీ మళ్ళించాడు. అందులో లాఠీఛార్జిలో కార్మికుడు మరణిస్తే కోపోద్రిక్తులైన ప్రజలు పోలీస్ స్టేషన్ను ముట్టడించిన ఫోటో ఉపాధ్యాయులుకావాలని, పాఠ్యపుస్తకాలు కావాలని విద్యార్థుల ఆలజడి. "స్త్రీలకు రక్షణ కావాలి-అధిక ధరలు తగ్గాలి"-వేల మంది స్త్రీలు గవర్నరుకు సమర్పించిన వినతిపత్రం "లారీ చెట్టుకు ఢీ" జపాన్‌లో కొత్త వంట పాత్ర-మారుమూల గ్రామంలో హత్య-కరువు ప్రాంతంగా నల్లగొండ బాక్స్ కట్టివేసిన మంత్రిగారి శుభాకాంక్షలు!!- పేపరు పెద్ద మనిషి బూతులు తిట్టుకుంటూ పేపరు మడతపెట్టాడు అతను దిగాల్సిన స్టేజీ వెనుక్కుంటున్నట్టు బయటకు చూస్తున్నాడు. స్టేజీ రాగానే డ్రైవర్ సడన్ బ్రేకు వేసాడు బస్సు ఒక ఊపు ఊగింది అంతకు ముందునుండే ఒకరి మీద ఒకరు పడి వున్నారు గనుక ఆవూపు వల్ల ఎవరిమీద ఎవరూపడలేదు.





పేపరు పెద్ద మనిషి హడావుడిగా దిగిపోయాడు. దగ్గర్లోనే వున్న యాదవ్ కూచోబోయే లోపల మరొకతను విసురుగా రావడమూ, తోసేసినట్టే వెళ్ళి కూచోవడమూ జరిగిపోయాయి. అతను అత్యాధునికుడి లాగా సూట్లో వున్నాడు. చేతిలో హేండ్బాగు. బస్సు మళ్ళీ బయలుదేరింది. పెద్ద శబ్దంచేస్తూ బరువుగా కదుల్తోంది "ఏమండీ-మీరే ఎక్కాలేదా?" బస్సు ముందు భాగంనుండి ఆడగొంతు వినిపించింది.

సమాధానంగా "ఆఁ-ఆఁ- ఎక్కాన్లేవే. పిల్లలు జాగ్రత్త!" - వృద్ధుడి బొంగురు గొంతు బస్సు వెనక భాగం నుండి వినిపించింది. బస్సులో కొందరు నవ్వుకున్నారు. అంత మందలో వాళ్ళిద్దరు ఎక్కడెక్కడున్నారో ఎలా వున్నారో యాదవ్ చూడలేక పొయ్యాడు. బయటకు చూస్తూ నిలుచున్నాడు. బద్ధకంగా కూచుని లంచాలు నెమరేస్తున్న ఒక ఆఫీసు కనిపించింది. ఆడబొమ్మల్తో ఆకర్షణలు వెదజల్లుతున్న బట్టల దుకాణాలు - మునిమునిగా నవ్వుకుంటున్న కిరాణా దుకాణాలు-జనరల్ స్టోర్స్-అందనంత ఎత్తు ఎదిగిన వెండి బంగారపు దుకాణం - మూసివేయబడ్డ ప్రభుత్వ పాఠశాల-యువతరాన్ని దారి మళ్ళించే క్రికెట్ మ్యాచ్లు, హాకీ మ్యాచ్లు, చూపెడుతున్న స్టేడియం - పోలీసులు కాపలా కాస్తూ నడిపిస్తున్న ప్రయివేటు కళాశాల - అనాధల కోసం కట్టిస్తున్న ఫుట్పాత్ - రిక్షా జనానికి ప్రాణం పోస్తున్న కేఫే-అక్కడక్కడ కిళ్ళీకొట్లు - రోగుల్ని పంచుకుని పీక్కుతింటున్న ఆసుపత్రులు - విద్యార్థుల్ని, మేధావుల్ని, శ్రమజీవుల్ని ఉరికంబమెక్కిస్తున్న కోర్టు-కోటీశ్వరుల సంతతి సం వదీసీ, ప్రవర్తనా స్ఫురణకు తెన రోడ్డున అడ్డదిడ్డంగా తిరుగుతు పశుపక్షులు - యూరినల్స్‌గానూ, ల

ట్రీలుగానూ ఉపయోగ పడుతున్న ఆట స్థలం-మేధావులు ప్రశ్నలు వేయకుండా కూచోబెట్టి వేల జీతాలిచ్చే యూనివర్సిటీ-చెప్పుల దుకాణం-ఆట వస్తువులదుకాణం రేడియో షాపు-ఫోటో సెంటర్ - బార్ అండ్ కేఫే-చిట్ (చీట్?) ఫండ్ఆఫీసు-ప్రయివేటు ఆసుపత్రి-క్షౌరశాల-బేకరీ-రెడీమేడ్ డ్రెస్సింగ్‌లకు లొంగని లాడ్జింగ్-పుస్తకాల దుకాణం-స్వీట్‌హౌస్-మురికికాలువ-ఓవర్ బ్రిడ్జి-రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్-నిర్మల్ బొమ్మలా అమర్చిపెట్టిన.. పళ్ళ దుకాణం మొదలయిన ఆరునెలలకే మూతబడిన పత్రిక ఆఫీసు-వాచ్ కంపెనీ-ఆప్టికల్స్ సెంటర్-జెరాక్స్ కార్నర్ - స్నాక్స్ అండ్ స్నాక్స్, కొన ఊపిరితో నడుస్తున్న ప్రెస్-ఆటోమోబైల్ షాపు-మ్యారేజ్ కార్నర్-ఖాళీ స్థలం-హోటల్-ఎయిరిండియా ఆఫీసు - నాలుగు రోడ్ల కూడలి-ముగిగిపోయిన కళలకు సుగంధాలు రాసి ప్రదర్శించేందుకు కట్టించిన ఆడిటోరియం-అధికారం కుర్చీ పాదాలు నాకుతున్న అకాడెమీ-అవకాశవాణి కేంద్రం-కుర్చీలెక్కి కూచున్న, జోగుతున్న, ప్రసంగిస్తున్న, గోలచేస్తున్న శాసనసభ-బస్సు ఆగుతోంది .. "ఈ రోజు ఇట్లా వుండగలుగుతున్నామంటే మన పటిష్టమైన ప్రణాళికలే ముఖ్యకారణం అని నేను మనవి చేస్తున్నాను. ఏనాడైతే ప్రతి పల్లె కూడా ముందుకువచ్చి మనయొక్క భవిష్యత్ ప్రగతి కార్యక్రమాలో పాలు పంచుకుంటుందో అట్లాగే ప్రతితాలూకా ప్రతి జిల్లా, ప్రతిరాష్ట్రంకూడాముందుకు వచ్చి ప్రగతి కార్యక్రమాల్లో పాల్గొంటాయోఅప్పుడు ప్రతియొక్క భాగద్దేశం కూడా ముందుకు పోతుందని నేను మనవి చేస్తూ వున్నాను. ఇక పోతే ఈ రకంగా మీకు సేవచేసే ఇలాంటి అవకాశం నాకు యిచ్చినందుకు నాయొక్క ... " తెలిసిన ముఖం కళ్ళముందుకొచ్చి పలకరించింది "హలో"-అన్నాడు యాదవ్. అంతకు రెండ్రోజుల క్రితంరాసి పత్రికకుఅందించిన ఓ మంత్రిగారి అజ్ఞానపుఉపన్యాసం మెదడ్లో తిరగడం ఆగిపోయింది. పలకరించి తను మాట్లాడతాడేమో ననుకున్నాడు. మాట్లాడలేదు. ఇతను మరో వ్యక్తితో మాటల్లో పడ్డాడు శాసనసభ గోపురాలమీద పక్షులు రెట్టలువేసిన మరకలు కనిపిస్తున్నాయి.

ప్రజల తీర్పుకు హర్షం ప్రకటిస్తూ ప్రజలకు సేవచేయడమే తన ధ్యేయం అని గెలిచిన అభ్యర్థి చేసిన ప్రకటనను తానే రాసాడు. ఉచిత కల్లు సారా కుళాయిలు నిరంతరం ప్రవహింపజేసిజనాన్ని మోసంచేసి. డబ్బుతో మభ్యపెట్టి గెలవడం ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధం అని అన్న ఓడిపోయిన ప్రతిపక్షప్రత్యర్థి ప్రకటనను తానే రాసాడు బస్‌స్టాండ్‌లో బస్సుకోసం ఎదురుచూస్తున్న యువతిని లాక్కొచ్చి డ్యూటీలోవున్న పోలీసులంతా కలసిరేప్ చేసారని ప్రజలుచేసిన ఆందోళన గురించి తనే రాసాడు ఆమె రేప్ చేయబడలేదని స్పృహ లేని స్థితిలో పడి వుండగా పోలీసులు హాస్పిటల్‌లో చేర్పించారని పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్యానాన్ని తనే రాసాడు. జీతాలివ్వడంలేదని నిరాహార దీక్ష జరుపుతున్న వృద్ధ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి మీద లాఠీ ఉపయోగించారన్న వార్త తనే ప్రకటిం




వాడు వృద్ధాప్యంవల్ల చలి భరించలేక జబ్బు పడ్డాడన్న ప్రభుత్వ ప్రకటనను తనే తెలియజేసాడు.

బస్సు ఒక కుదుపులో మళ్ళీ ఆగింది. బయటకు చూస్తే- సు శాసనసభనుండి మధ్యలో మరో స్టేజీ కూడా దాటేసి వచ్చిందని తెలిసింది. ఇంకా కొద్దిదూరం పోతే సెక్రటేరియట్. బస్సు చుట్టూ గందరగోళంగా వుంది. బస్సులోని వాళ్ళంతాదిగుతున్నారు ఏమిటి? ఏమైంది? ఎవరూ జవాబు చెప్పరు. హడావిడి, కల్లోలం "జల్దీ ఉతర్ కే చలే జావో భై" కండక్టరు అరుపు. ప్రవాహంలో తనూ ఒక అణువై దిగి పోయ్యాడు యాదవ్. నిలదొక్కుకుని చూట్టూ చూసాడు రోడ్డంతా అస్తవ్యస్తంగా వుంది. ముందు చౌరస్తాలో బాష్పవాయువు ప్రయోగించారని, ఫైరింగ్ ఆర్డర్స్ కూడా వున్నాయని తెలిసింది. అక్కడ వుండడం మంచిది కాదు. బస్సు వెనక్కి మళ్ళు తోంది. ఎక్కడి వారక్కడే సందుల్లో గొందుల్లో దూరుతున్నారు. ఎదురుగుండా పోలీస్ వాన్ వేగంగా వస్తోంది. పాత బస్తీలో అల్లరయినప్పుడు తను ప్రెస్‌కు సంబంధించిన వాణ్ణని చెబుతున్నా వినిపించుకోకుండా పోలీసులు కొట్టిన దెబ్బలు. ఆతర్వాత హాస్పిటల్ అనుభవం జ్ఞాపక మొచ్చింది. మళ్ళీ రిస్క్ తీసుకోవాలా? ఆలోచించే సమయంలేదు కాళ్ళు అతని ప్రమేయం లేకుండా అక్కడి నుంచి కదిలాయి. పత్రిక ఆఫీసుకు చేరేది ఎలా?

యాదవ్ ఒక సందులో దూరాడు. అది ఘోరంగా వుంది. మురికి వాసన, బురద పెంకులు, అంతకు ముందు కొద్ది రోజులక్రితం మతకలహాల కారణంగా కాల్చివేయబడ్డ దుకాణాలు, నల్లని మసి, బూడిద, కూలినయిండ్లు, అద్దంముక్కలు, చెట్ల కొమ్మలు, మట్టి రాళ్ళు... రెండు ఫర్లాంగులు పరిగెత్తితే చిన్నరోడ్డుకనిపించింది. అక్కడ కూడా పరిస్థితి బాగు

న్నట్టు లేదు. అందరూ యిళ్ళల్లోకి జొరబడతున్నారు. అక్కడున్న కిళ్ళీ కొట్లూ కేఫూ మూసుకున్నాయి తనముందు పరుగెడుతున్న వాళ్లు ఓమూలమలుపులో ఉన్న యింట్లోకి జొరబడ్డారు అతనూ అనుసరించాడు. లోనికెళ్ళగానే తెలిసింది. అది యిల్లుకాదు. చిన్న గ్రంధాలయం లైబ్రరీ హాల్లో చాలా మంది కనిపించారు. ఎవరో తన వెనకే తలుపు వేసేసారు. ఫ్యాన్లు తిరుగుతున్నాయి. టేబుళ్ళమీద పత్రికలు వణికి పోతున్నాయి. అందులో వున్న వాళ్ళంతా టేబుళ్ళు విడిచి కిటికీల దగర చేరారు. రోడ్డును ఆక్రమించుకుంటున్న పోలీసుల్ని చూస్తున్నారు.

తను అక్కడ కొంతసేపు గడపడం తప్పదు. ఆఫీసుకు ఫోన్ చేద్దామనుకున్నాడు. కాని అక్కడ ఫోన్ కనిపించలేదు. చుట్టూ చూసాడు. వరసగా అలమారాలు. అలమారాల గాజు అద్దాల్లోంచి బయటకు చూస్తున్న పాతవార్తాపత్రికలు, పుస్తకాలు....యాదవ్ మనసు పత్రికల్లో తిరుగుతోంది.

గని కూలి ఐదువందల మంది దుర్మరణం. లారీ ప్రమాదంలో ఇద్దరిమృతి. కరువు, వరద, అతివృష్టి, అనావృష్టి, హెలికాప్టర్ లో మంత్రుల సందర్శన, సానుభూతి, ఒక్కొక్కరికీ ఒక పంచె, అరకిలో బియ్యం పంపకం - హిందూ ముస్లిం కొట్లాటలు-రక్తపాతం-నిరాహార దీక్షలు-అభయ హస్తాలు-అడవిలో బండి ఆపి ధాన్యం ఎడ్లతో సహా దోచుకుపోవడం, హైజాకింగ్, ప్లేన్ కాలి కూలినా అయుస్సు నిండని రాజకీయ చిరంజీవి. ఉత్తర భారతంలో హోషియార్ పూర్ గురుద్వారాలో పోలీసులు విధవరాలు ప్రీతం కౌర్ శరీరంతో ప్రయోగాలు-గంగాపూర్ లో వరకట్నం మంటల్లో సజీవంగా కాల్చబడిన నవవధువు నీలం. రాజధానిలో ఇతర దేశాల నాయకులతో శాంతి చర్చలు... లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లులు. గెలిచిన పార్టీలోకి దూకుతున్న పిల్లులు. జరిగిన మానభంగాల ఎంక్వయిరీ-దురాగతాలకు పాల్పడే అధికారులను శిక్షించాలని ప్రజల తిరుగుబాటు-నేపాల్ రాజు ఇండియాపర్యటన-144 సెక్షను అమలు - కర్ఫ్యూ-రైలు పట్టాలు పీకేసి ఫైళ్ళు తగలబెట్టిన సమాచారం-భారతీయ నర్తకికి మాస్కోలో అవార్డు - ఆకలికి ఆగలేక తన చంటిపాపను ఫ్రై చేసుకుని తిన్న తల్లి - ఆస్తి దక్కించుకోవాలని అన్నను చంపిన తమ్ముడు. నిజాలు బయటపెట్టినందుకు జర్నలిస్టు భార్య మానభంగం-ఖైదీల కళ్ళలో యాసిడ్....

యాదవ్ మనసు వికలమయ్యింది పక్కకు తిరిగాడు. అద్దాల నుండి హుందాగా కనిపిస్తున్న బైండు పుస్తకాలు. పుస్తకాలనిండా భయంకర సత్యాలు. మనషుల్ని చదివిన పుస్తకాలు. స్వేచ్ఛాగీతాలు పాడినందుకు శిక్షకు గురయిన మధురగాయకుడు పాల్ రాబ్సన్. నీగ్రోల హక్కులకోసం పోరాడి హింసకుగురైన ఏంజెలా డివిస్. పాస్ పోర్టు రద్దు చేస్తే అమెరికా చేరలేని మహానటుడు చార్లీ చాప్లిన్. దేశం నుంచి బహిష్కరించబడ్డ బెర్టోల్డ్ బ్రెహ్ట్. అణ్వస్త్రాలను వ్యతిరేకించిన నేరానికి ఉరితీయబడ్డ రోజెన్ బర్గ్

దంపతులు.

స్వేచ్ఛ? వ్యక్తిస్వేచ్ఛ? వాక్ స్వేచ్ఛ? పత్రికా స్వేచ్ఛ?... జైల్లో రచయితలు! జైల్లో కళాకారులు! జైల్లో మేధావులు!!

పుస్తకాలు మూసిపెట్టే వున్నాయి. పుస్తకాలు నిద్ర పోయినట్లే వున్నాయి. పుస్తకాల్లో తిరుగుబాట్లు, పుస్తకాల్లో ఉద్యమాలు, పుస్తకాల్లో యుద్ధాలు, పుస్తకాల్లో రక్త ప్రవాహాలు, పుస్తకాలంటే మానవ మస్తిష్కాలు-పుస్తకాలు మూసుకునే వున్నాయి. కానీ చరిత్ర? చరిత్ర తెరుచుకునే వుంది. చరిత్ర మేల్కొనే వుంది. చరిత్ర కుత కుత ఉడుకుతూనే వుంది.

యాదవ్ అసహనంగా కదిలాడు. కిటికీ దగ్గర నిలబడ్డ వాళ్లు కూడా అసహనంగా వున్నారు. జైలులో బంధించినట్టూ గుండెలోకి రక్తం పంపేనాళాలన్నీ తెగిపోయినట్టూ అనిపించింది. పత్రిక ఆఫీసు -ఉద్యోగం - అబద్ధాలకు పాలిష్ కొట్టి అమ్ముకునే పత్రికలకు విరుద్ధంగా జనానికి సరైన అవగాహన కలిగించే విధంగా తను, తన తోటి వాళ్ళూ ప్రయత్నించడం కనీస కర్తవ్యం. తనలాగే ఆలోచించేవాళ్ళు తనకుతోడు చాలామంది వున్నారు.

కాలం కడుపుమీద పెట్టబడుతున్న చురకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అద్దాలు నిజాన్ని చూపినట్లే-తనలాంటి వాళ్ళు పని చేయాలి. జనానికి నిజాల్ని చూపాలి, అయితే తను తనలాంటివాళ్ళూ నిజాల్లోకి దిగకుండా అడ్డుకునే అద్దాం దగ్గర, కిటికీల దగ్గరా ఆగిపోకూడదు. దాటేసి పోతేనే సంఘర్షణలో పాలుపంచుకున్నట్లు-తప్పదు. ఈ జీవనపోరాటంలో తనూ ఒక ప్రధానభాగం కాక తప్పదు. కిటికీలోంచి బయటకు చూశాడు. బయట అంతగా పెద్ద మార్పేమీ వచ్చినట్లులేదు. పోలీసు జీపు చక్రాలచప్పుడు వినిపిస్తోనే వుంది.

లైబ్రరీ హాల్లోంచి ఎంతో ఆత్మస్థయిర్యంతో, కర్తవ్య నిర్వహణకోసం బయటకు నడిచాడు యాదవ్.

○ ○ ○ ○

వ్యవసాయక దేశంలాగా ఆకుపచ్చ రంగులో భారతదేశం, ఆకుపచ్చ రంగు మారి నల్లని చుక్కలు కనిపిస్తున్నాయి. చుక్కలు మెల్లిగా కదులుతున్నాయి. నల్లని చుక్కలు మనుషుల తలలవుతున్నాయి. ముఖాలు ముఖాలు కనిపిస్తున్నాయి. ఆలోచనలతో, ముఖాలు ఎర్రబడినై. వెనక్కి లాగి-వేసిన బేడీలను వడితిప్పి విరిచేసే ప్రయత్నం చేస్తున్నాయి. బలమైన యినుప గొలుసుల్ని లాక్కుంటూ ముందుకు అడుగులేస్తున్నాయి కాళ్లు....వెనక మిగిలిపోతున్నాయి కాలి ముద్రలు, ఆ ముద్రల్ని వెతుక్కుంటూ అనుసరిస్తున్నారు - చిన్న పిల్లలు.... ★